క్లుప్తంగా

మాసిక మహోత్సవం



గుమ్మఘట్టలో కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజనమ్మ

గుమ్మఘట్ట: మండల కేంద్రంలోని అంగన్ వాడీ కేంద్రంలో మాసిక మహోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజినమ్మ మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయడం నేరమన్నారు. బాల్యవివాహాలు ప్రోత్సహిస్తే చట్ట రీత్యా శిక్షార్హులవుతారన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ ఆది బయమ్మ, అంగన్ వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని ఎర్రంపల్లిలో అదే గ్రామానికి చెందిన సత్యనారాయణ అనే రైతు తోటలో విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి, రాగి వైరు ఎత్తుకెళ్లారు. బాధిత రైతు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ప్రమాణాలు పాటించని ఆర్వో ప్లాంట్లకు నోటీసులు



ప్లాంట్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేస్తున్న మున్సిపల్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

రాయదుర్గం: పట్టణ పరిధిలో ప్రమాణాలు పాటించని ఆర్ఓ ప్లాంట్లకు మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. మంగళవారం 'సాక్షి'లో 'నిబంధనలకు 'నీళ్లు' శీర్షికన కథనం ప్రచురితమయ్యింది. మున్సిపల్ కమిషనర్ కిశోర్ స్పందించారు. ప్రమాణాలు పాటించని ఆర్వో ప్లాంట్లు, ప్యాకింగ్ ప్లాంట్లు, నీటి బాటిల్ ప్లాంట్లను గుర్తించి, సంబంధిత యజమానులకు నోటీసులు జారీ చేయించారు. కమిషనర్ మాట్లాడుతూ ఐఎస్ఐ, బీఐఎస్ రిజిస్ట్రేషన్లు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, నీటి నాణ్యత ధ్రువీకరణ, కెమిస్ట్ మైక్రోబయాలజీ ల్యాబ్ ధ్రువీకరణ కోసం ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేశామని తెలిపారు.

పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలి



పశుపోషకులకు జాగ్రత్తలు తెలియజేస్తున్న పశువైద్యాధికారి శ్రీనివాసులు

కూడేరు: వర్షాలకు మొలుస్తున్న గడ్డిని ఎక్కువగా తింటే పశువులు రోగాల బారిన పడే అవకాశం ఉందని, పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన పశువులకు వచ్చే వ్యాధులపై పశు పోషకులకు అవగాహన కల్పించారు. గొర్రెలు, మేకల్లో చిటిక వ్యాధి వస్తుందన్నారు. ముందస్తుగా ఈటీ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. పశువులకు శ్వాస సంబంధ వ్యాధులు వస్తాయన్నారు. పశు పోషకులు ముందస్తు జాగ్రతలు తప్పని సరిగా తీసుకోవాలని సూచించారు.

అక్కమ్మ దేవతల జలధి



అక్కమ్మ దేవతలకు గంపల్లో చెరకును తీసుకొస్తున్న దృశ్యం

కూడేరు: మండలంలోని పి.నారాయణపురంలో అక్కమ్మ దేవతల జాతర వైభవంగా జరుగుతోంది. మంగళవారం జలధి కార్యక్రమాన్ని గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. గ్రామానికి దూరంలో ఉన్న వంక నుంచి గంపల్లో చెరుకును మంగళవాయిద్యాల నడుమ అక్కమ్మ దేవతల ఆలయానికి తీసుకొచ్చారు. జలధి వేడుకల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బుధవారం వసంతోత్సవంతో జాతర ముగుస్తుందని గ్రామపెద్దలు, నిర్వాహకులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కూడేరు: ముద్దలాపురం సమీపంలో వైటీ శివారెడ్డి తోట వద్ద అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉదిరిపికొండకు చెందిన నాగరాజు, అరుణ గాయపడ్డారు. వీరు అనంతపురం నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా, ఉరవకొండ నుంచి అనంతపురం వైపు అతి వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనింది. గాయపడిన వారిని 108 వాహనంలో అనంతపురం ఆస్పత్రికి తరలించారు.



పెన్నహోబిలం లక్ష్మీనృసింహుని రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



ఉత్తర ద్వారం వద్ద రథోత్సవం తిలకించడానికి వేచి ఉన్న భక్తులు

లక్ష్మీ నారసింహ...నమో నమః

ఉరవకొండ సమీపంలోని పెన్నహోబిల పుణ్యక్షేత్రం ఆలయ పరిసర ప్రాంతాలు లక్ష్మీ నరసింహ..నమో నమః అంటూ మార్మోగిపోయాయి. మంగళవారం పెన్నహోబిల లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన బ్రహ్మరథోత్సవం కనుల పండువగా సాగింది. వేలాదిగా భక్తులు తరలివచ్చి గోవింద..గోవింద అంటూ నామస్మరణ చేశారు. ఆలయ పరిసర ప్రాంతాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి మడుగుతేరు ఉత్సవంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు. స్వామికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం మడుగుతేరులో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే విశ్వకు ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందించారు. రథోత్సవంలో ఆలయ ఈఓ విజయ్‌కుమార్, ప్రధాన అర్చకులు ద్వారాకానాథ్‌చార్యులు, వైస్ ఎంపీపీ వై.శ్రీనాథ్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు అశోక్, తేజోనాథ్, మూలగిరిపల్లి ఓబన్న తదితరులు పాల్గొన్నారు. – ఉరవకొండ:



రథోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



బ్రహ్మరథోత్సవం తిలకించడానికి భారీగా తరలివచ్చిన భక్తులు

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు





అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి,గంగను తీసుకొస్తున్న గ్రామస్తులు

వజ్రకరూరు: మండలంలోని తట్రకల్లులో లక్ష్మీనరసింహస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామికి పంచామృతాభిషేకాలు, అష్టోత్త రశతనామావళి, ఆకుపూజ, గంగ పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నదానం చేశారు.సాయంత్రం ఆలయం నుంచి అడ్డపల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి, గ్రామ వీధుల్లో ఊరేగించారు.

భక్తులకు ఉచితంగా మందుల పంపిణీ

ఉరవకొండ: పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి రథోత్సవంలో భాగంగా డాక్టర్ ముత్తులూరు ఓబన్న, డాక్టర్ ముత్తులూరు భారత లక్ష్మి జ్ఞాపకార్థం ఆలయ మాజీ చైర్మన్ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. మందుల పంపిణీ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వై.శ్రీనాథ్‌రెడ్డి, రాకెట్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్‌నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు తేజోనాథ్, నాగరాజు, శీనా తదితరులు పాల్గొన్నారు.



పెన్నహోబిలంలో మందులు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

ఆదాయం ఘనం..అభివృద్ధి శూన్యం

- అభివృద్ధికి నోచుకోని జోడు లింగాల ఆలయం
- భారతదేశంలోనే ప్రఖ్యాతిగాంచిన శివాలయం



జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయం

కూడేరు: మండలకేంద్రంలోని సంగమేశ్వర స్వామి ఆలయంలో వెలసిన శివపార్వతులు పుట్ట శిలలు (స్వయంభు జోడు లింగాలు) ఆలయ చరిత్ర అమోఘం.. ఆదాయం ఘనం.. అభివృద్ధి మాత్రం అంతంతమాత్రమే. దక్షిణ భారతదేశంలో ప్రఖ్యాతిగాంచిన శివాలయాల్లో ఒక్కటిగా కూడేరు జోడు లింగాలు నిలిచాయి.జోడు లింగాల ఆలయం 16వ శతాబ్దం రెడ్డి రాజుల కాలం నాటిదిగా ఆలయ శాసనాలు చెబుతున్నాయి. ఈ ఆలయాన్ని సుమారు 30 ఏళ్ల క్రితం దేవదాయ శాఖ పరిధిలోకి తీసుకున్నారు. జోడు లింగాలు కావడంతో భక్తుల తాకిడి ఎక్కువ. జిల్లా నలమూలల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా దర్శనానికి భక్తులు తరలి వస్తుంటారు.

ఆలయంలో శుభకార్యాలు ఎక్కువ ..

ఆలయం వద్ద పెళ్లిళ్లు ఎక్కువగా జరుగుతుంటాయి. పెళ్లికి రూ.400 వసూలు చేస్తారు. ముహూర్తాన్ని బట్టి ఏడాదిలో 150 నుంచి 250 వరకు పెళ్లిళ్లు జరుగుతాయి. ఈ లెక్కన ఆలయానికి ఏడాదికి రూ.లక్షకు పైగానే ఆదాయం సమకూరుతుంది. ఆలయం వద్ద పూజా సామగ్రి విక్రయించేందుకు ఏటా వేలం పాట ద్వారా రూ.2.5 లక్షల ఆదాయం వస్తుంది. సప్లయర్స్ అద్దెకు ఇచ్చేందుకు వేలం పాట ద్వారా రూ.లక్ష వరకు సమకూరుతుంది.

హుండీ కానుకల ఆదాయం అధికమే..:

ఆలయంలో రెండు శాశ్వత హుండీలు ఏర్పాటు చేశారు. భక్తులు నగదు రూపంలో హుండీల్లో కానుకలుగా వేసి మొక్కులు తీర్చుకుంటారు. మహాశివరాత్రి, సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు సందర్భంగా, విడిరోజుల్లో హుండీ ఆదాయాన్ని దేవదాయ శాఖ అధికారులు లెక్కిస్తారు. గత నెల 17 నుంచి 26 వరకు బ్రహ్మోత్సవాలు జరిగాయి. ఈ నెల 23 హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ.3.24 లక్షలు వచ్చింది. ఏడాదికి హుండీ ఆదాయం రూ.10 లక్షల పైమాటే.

రూ.లక్షల్లో ఆదాయం..కనిపించని అభివృద్ధి:

ఆలయానికి ఏటా రూ.లక్షల్లో ఆదాయం ఉన్నా అభివృద్ధి కనిపించలేదు. ఎండోమెంట్ అధికారులు నిర్వాహణ ఖర్చులంటూ కాకి లెక్కలు చెప్పి అభివృద్ధి పనులు చేపట్టేందుకు డబ్బులు లేవంటున్నారు. ఐదేళ్ల క్రితం దేవదాయశాఖ ఈఓ, ఆలయ కమిటీ సభ్యులు అనాలోచితంతో నూతనంగా మంటపాలు నిర్మిస్తామంటూ ఆలయం చుట్టూ ఉన్న మంటపాలను కూల్చేశారు. భక్తులకు కనీసం మరుగుదొడ్ల సౌకర్యాలు కూడా లేవు. పెళ్లిళ్లు జరుపుకునే వారికి మంటపాలు లేక అవస్థలు పడుతున్నారు. ఆలయానికి వచ్చే ఆదాయంలో 80 శాతం సిబ్బంది జీతాలు, ఆలయ నిర్వాహణకు సరిపోతుందని దేవదాయ శాఖ అధికారులు చెబుతున్నారు. దేవదాయ శాఖ అధికారులు ఆదాయాన్ని తీసుకెళ్తున్నారేగానీ, ఎండోమెంట్ ద్వారా నిధులను తీసుకొచ్చి ఆలయాన్ని అభివృద్ధి చేయడం లేదని భక్తులు అంటున్నారు.

రూ.8 లక్షలు బ్యాంకు ఖాతాలో నిల్వ ఉంది

నేను కొద్ది నెలల క్రితమే ఈఓగా బాధ్యతలు చేపట్టా. చార్జ్ తీసుకున్నప్పుడు బ్యాంకులో ఆలయ ఆదాయం రూ.2 లక్షలు ఉంది. తర్వాత హుండీలోని కానుకలను రెండు సార్లు లెక్కించగా సుమారు రూ. 8 లక్షలు, బ్రహ్మోత్సవాల సందర్భంగా వచ్చిన ఆదాయంలో ఖర్చులు పోనూ బ్యాంకులో సుమారు రూ.8 లక్షల వరకు నగదు ఉంది. ఆలయానికి వచ్చే ఆదాయం మహాశివరాత్రి, బ్రహ్మోత్సవాలు నిర్వహణకు, ఇతర ఖర్చులకే ఎక్కువ భాగం సరిపోతోంది.

– రమేష్ బాబు, ఆలయ ఈఓ

జలధి పూజ



అక్కమ్మ దేవతలకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆత్మకూరు: మండల కేంద్రంలో అక్కమ్మ దేవతల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జలధి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలోని అక్కమ్మ దేవతలకు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆత్మకూరు సమీపంలోని ఓ పొలంలో జలధి పూజ నిర్వహించారు. అక్కడ వేల మంది భక్తుల నడుమ పూజల అనంతరం అక్కమ్మ దేవతలున్న గంపను తలపై పెట్టుకొని ఆలయం వద్దకు చేరుకున్నారు. దారి పొడవునా భక్తులు అక్కమ్మ దేవతల గంపకు నీరు పోసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పూలమాలలతో అక్కమ్మ దేవతను అలంకరించి పూజలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేపట్టారు. బుధవారం ఆలయం చుట్టూ పన్నేరపు బండ్ల ప్రదక్షిణ, పరుష కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలియజేశారు.



అక్కమ్మ దేవతల గంపను ఆలయానికి తీసుకొస్తున్న దృశ్యం

రేపు మెగా రిటైల్ ఎక్స్‌పో

అనంతపురం: రాంనగర్‌లోని రాయల్ ఫంక్షన్ హాలులో గురువారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెగా రిటైల్ ఎక్స్‌పో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు బ్యాంకు రాంనగర్ బ్రాంచి చీఫ్ మేనేజర్ జి.రాజేష్ తెలిపారు. వ్యక్తిగత రుణాలు, వాహన, గృహ, విద్య, బంగారు రుణాలు మంజూరు చేస్తామన్నారు.

గోకుల ఆలయ వార్షికోత్సవం

అనంతపురం కల్చరల్: నగరంలోని గోకుల వెంకటేశ్వరస్వామి మందిర వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఇస్కాన్ వారి గోశాలలో మందిర నిర్వాహకులు తెల్లవారుజామున సుప్రభాత సేవ, స్వామివారికి మహాభిషేకం, అష్టదళ పాదపద్మార్చన చేపట్టారు.

భైరవానితిప్ప ప్రాజెక్టు పరిశీలన



బీటీ ప్రాజెక్టును పరిశీలిస్తున్న తహసీల్దార్ ఈశ్వరయ్య

బ్రహ్మసముద్రం: మండలంలోని భైరవానితిప్ప ప్రాజెక్టును మండల తహసీల్దార్ ఈశ్వరయ్య మంగళవారం మధ్యాహ్నం పరిశీలించారు. ప్రాజెక్టులో నీటి మట్టాన్ని, ఇతర వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. కర్ణాటక ప్రాంతంలో వర్షాలు అధికంగా పడి వరదనీరు బీటీపీ ప్రాజెక్టులోకి చేరుతోంది. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, వీఆర్వో లక్ష్మన్న పాల్గొన్నారు.

రేపు మెగా రక్తదాన శిబిరం

రాయదుర్గం: గుమ్మఘట్ట ప్రాథమిక వైద్యశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞానవేదిక అధ్యక్షుడు ఎంజీ వీరన్న తెలిపారు.

నేడు కౌలుకు ఆలయ భూముల వేలం

వజ్రకరూరు: స్థానిక జనార్ధన వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఆలయ భూములు కౌలుకు ఇవ్వడానికి బుధవారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం ఉంటుందని ఆలయ ఈఓ అంగదాల కృష్ణయ్య తెలిపారు. జనార్ధన వేంకటేశ్వర స్వామి, జనార్ధన ఆంజనేయస్వామి, రామేశ్వర స్వామి, చొప్పరం ఆంజనేయస్వామి, చెన్నకేశవ ఆంజనేయ దేవస్థానాల భూములు కౌలుకు ఇవ్వనున్నట్లు తెలిపారు. మంగళ వారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2024- 2025 (29-05-2024 నుంచి 31-03- 2025 వరకు) పై ఆలయ భూములు కౌలుకు ఇవ్వడానికి వేలం వేస్తున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొన దలచిన వారు రూ.1000 డిపాజిట్ చెల్లించాలన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పద్మావతి

వజ్రకరూరు: కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి తెలిపారు. మంగళవారం మండలంలోని కొనకొండ్లలోని అంగన్‌వాడీ కేంద్రంలో పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకొని సమావేశం ఏర్పాటు చేశారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆయాలు మల్లేశ్వరి, లక్ష్మీదేవి, లక్ష్మీ ,కిశోర బాలికలు, తల్లులు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసులు

బొమ్మనహాళ్: మండల కేంద్రంలో డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. రాయదుర్గం సీఐ ఎం.శ్రీనివాసులు మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జూన్ 6 వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. సోదాల్లో బొమ్మనహాళ్, డి.హీరేహాళ్, కణేకల్లు ఎస్ఐలు శ్రీనివాసులు, గురుప్రసాద్ రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కొండెక్కిన కూరగాయల ధరలు

- వారం వ్యవధిలోనే రెట్టింపు ధరలు
- కూరగాయలు కొనులేకపోతున్న సామాన్యులు



కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

రాయదుర్గం: రోజు రోజుకూ నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయి. దీనికితోడు కూరగాయల ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయి. దీంతో సామాన్య ప్రజలు ఏం కొనాలో .. ఏం తినాలో అని అయోమయంలో ఉన్నారు. దీనికి తోడు కోడి, మేక, గొర్రె మాంసం, చేపలు, గుడ్డు ధరలు కూడా అమాంతం పెరిగాయి. దీంతో మాంసం ప్రియులు ఉన్నదాంతోనే సర్దుకు పోవాల్సి వస్తోంది. కిలో చికెన్ రూ.220 రూ.250 వరకు ఉంటే.. మటన్ ధర రూ.600 నుంచి రూ.650కి పెరిగింది. దీంతో ఎక్కువ మంది చేపలు కొనుగోలుపై దృష్టి సారిస్తున్నారు. వీటికి భిన్నంగా కూరగాయలు ధరలు కూడా పెరుగుతున్నాయి. రైతు బజారు, డైలీ మార్కెట్, ఇతర దుకాణాల్లో ధరల పెంపు సామాన్యులకు ఇబ్బందిగా మారుతోంది.

కొత్తిమీర కొనలేం..?

కూర ఏదైనా సరే ఘుమ ఘుమలాడించేది కొత్తిమీర. దీంతో కూరగాయలు కొనేప్పుడు కొద్దిగా కొత్తిమీర, కరివేపాకు అడగడం, ఇవ్వడం సర్వసాధారణమే. ప్రస్తుతం కొత్తిమీర చిన్న కట్ట రూ.20 పెద్దది రూ.30 వరకు కొనాల్సి వస్తోంది. కరివేపాకు కావాలంటే రూ.20 చెల్లించాలి. అల్లం కిలో రూ.200, వెల్లుల్లి రూ.100, వంకాయ రూ. 50, టమాట రూ.50, పచ్చిమిర్చి రూ.120, బీర రూ.120, క్యాప్సికమ్ రూ. 80, బీన్స్ రూ.200, ఆలు రూ.60, క్యారెట్ రూ.120 ఇలా బెండ, బీట్‌రూట్, దొండ, కాకర ఏది కొనాలన్నా రూ.40 పైమాటే.

ఆకు కూరలదీ అదే పరిస్థితి : వారం రోజుల క్రితం రూ.10 ఇస్తే పలకలాకు, మెంతాకు కట్ట ఇచ్చేవారు. దాంతో పప్పుకూర ఈజీగా అయ్యేది. ప్రస్తుతం ఏది కొనాలన్నా రూ.5 పైమాటే. రూ.20 ఇస్తేగానీ పప్పుకు సరిపడా ఆకు కూరలు రావడంలేదు.

వినియోగదారులపై భారం పడకుండా విక్రయాలు

రాష్ట్ర ప్రభుత్వం గత 59 నెలల కాలంలో కూరగాయల ధరలను నియంత్రణలో ఉంచింది. ప్రజలకు ఏది అవసరమో దాన్ని గుర్తించి మార్కెట్లకు ఇబ్బంది లేకుండా సరుకు రవాణాకు అనుమతులిచ్చింది. టమాట, ఉల్లి కన్నీళ్లు పెట్టించాయి. ఆ సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. రాయితీ ప్రకటించి, వాటిని ప్రజలకు అందించే ఏర్పాట్లు చేశారు.

రూ.500 తీసుకెళ్లినా సంచిలోకి రాలేదు

కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. మార్కెట్‌కు రూ.500 తీసుకెళ్లినా వారానికి సరిపడా కూరగాయలు రావడం లేదు. రెండు నెలల క్రితం వరకు ఇలాంటి ఇబ్బందులు చూడలేదు. ఎందుకు ధరలు పెరిగాయో అర్థం కావడంలేదు.

– మమత, గృహిణి, రాయదుర్గం

మెలకువలు తెలియజేయండి



వజ్రకరూరులో విత్తనకాయలు అందిస్తున్న డీడీఏ జి.శివప్రసాద్ తదితరులు

వజ్రకరూరు: అర్హులైన ప్రతి రైతుకూ రాయితీ వేరుశనగ విత్తనాలు అందేలా చూడాలని, పంటల సాగులో రైతులు మెలకువలు పాటించేలా అవగాహన కల్పించాలని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ (డీడీఏ) జి.శివప్రసాద్ అన్నారు. మంగళవారం రాగులపాడు, గంజికుంట, వజ్రకరూరు గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో జరుగుతున్న రాయితీ విత్తన వేరుశనగ పంపిణీని డీడీఏ పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు మాట్లాడుతూ రాయితీతో అందిస్తున్న వేరుశనగ విత్తనాలు బాగున్నట్లు డీడీఏకు తెలియజేశారు. అనంతరం గంజికుంట ఆర్‌బీకేలో రాయితీ విత్తన వేరుశనగ పంపిణీపై అధికారులతో డీడీఏ సమావేశమయ్యారు. అనంతరం డీడీఏ మాట్లాడుతూ పంటలసాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు ఎప్పటికప్పుడు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ పద్మజ, ఏఓ మధుకర్, వీఏఏ సురేష్‌నాయక్, ఎంపీఈఓ ప్రమీల, రైతులు తదితరులు పాల్గొన్నారు.

1,283 రైతులకు వేరుశనగ పంపిణీ

శెట్టూరు: మండలంలో విత్తన వేరుశనగ వేగంగా పంపిణీ జరుగుతుంది. ఇప్పటి వరకు 1,283 మంది రైతులకు 1,181 క్వింటాళ్ల విత్తన కాయలు పంపిణీ చేసినట్లు ఏఈఓ ఆంజనేయులు తెలిపారు. మండలంలోని అన్ని ఆర్‌బీకే కేంద్రాల్లో రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. చింతర్లపల్లి, తిప్పనపల్లి గ్రామాల్లో అత్యధికంగా విత్తనం పొందినట్లు తెలిపారు.

శివాలయంలో చోరీ

కుందుర్పి: మండలంలోని రుద్రంపల్లి శివాలయంలో మంగళవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు ఆలయం తలుపులు ధ్వంసం చేసి, లోపలికి ప్రవేశించారు. హుండీలో ఉన్న రూ. 40 వేలు ఎత్తుకెళ్లారు. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రైవేట్ వద్దు.. ప్రభుత్వ కళాశాలలే ముద్దు



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో చేరాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్య వర్గ సభ్యులు చందు, రాజేష్ కోరారు. మంగళవాం స్థానిక ఎంఆర్‌సీ వద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని కరపత్రాలను ఏఐఎస్ఎఫ్, యూత్ ఆర్బిట్ ఆర్గనైజేషన్ సంస్థ వ్యవస్థాపకులు చంద్రశేఖర్‌లతో కలిసి విడుదల చేశారు. ప్రైవేట్ కళాశాలలు వద్దు.. ప్రభుత్వ కళాశాలలే ముద్దు అని ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సాగర్, నాగేంద్ర, ప్రకాశ్‌పాల్గొన్నారు.